జంగారెడ్డిగూడెం ఎస్ఐ సాగర్‌బాబు సస్పెన్షన్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విఆర్‌కు వెళ్లిన జంగారెడ్డిగూడెం ఎస్ఐ సాగర్‌బాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జంగారెడ్డిగూడెంలో ఎస్ఐగా సాగర్‌బాబు విధుల్లో ఉన్న సమయంలో పట్టణంలోని ఓ పాఠశాల భవన వివాదం, పలు కేసుల నమోదులో అలసత్వం వహించారని ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఇటీవల ఎస్ఐను విఆర్‌కు పంపారు. అలాగే ఆయన గతంలో పనిచేసిన చోట ఉన్న ఆరోపణలపై కూడా దృష్టిసారించిన పోలీసు ఉన్నతాధికారులు విఆర్‌కు పంపిన సాగర్‌బాబును సస్పెండ్ చేసినట్లు తెలుస్తుంది. దీనిపై స్థానిక పోలీసు ఉన్నతాధికారులను సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

'పొత్తు'పై మల్లగుల్లాలు..!

టిడిపి, జనసేన పొత్తుపై పవన్‌కల్యాణ్ స్పష్టత

జిల్లాలో ఇరుపార్టీల నేతల్లో చర్చలు

సీట్ల పంపకాలపై ఎవరి లెక్కలు వారివే

ఏయే సీట్లలో ఎవరెవరు బరిలోకి దిగుతారంటూ సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అంతా ఊహించుకుంటున్నట్లుగానే టిడిపి, జనసేన మధ్య పొత్తు ఖరారైంది. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసే పోటీ చేస్తాయని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ స్పష్టత ప్రకటన చేశారు. దీంతో టిడిపి, జనసేన పొత్తుపై దిగువస్థాయిలో ఆయా పార్టీల శ్రేణుల్లో నెలకొన్న సందేహాలు పటాపంచలయ్యాయి. దీనికి బిజెపి కలిసొస్తుందని ఆశిస్తున్నామని, ఒకవేళ బిజెపి రాకపోయినా టిడిపితో పొత్తు ఖాయమన్నట్లు పవన్ చేసిన ప్రకటన టిడిపి శ్రేణుల్లో ఉత్సాహాన్నిచ్చిందని చెప్పొచ్చు. చంద్రబాబు అరెస్టు నేపథ్యం దగ్గర నుంచి జనాల్లో సానుభూతి ఉన్నా ప్రభుత్వ నిర్బంధం, ఇతర కారణాల రీత్యా టిడిపి శ్రేణులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. అక్కడికి పోలీస్ నిర్బంధానికి ఎదురొడ్డుతూ పాలకొల్లు, తణుకు తదితర ప్రాంతాల్లో ఆందోళనలు చేపట్టారు. చంద్రబాబుకు రిమాండ్, ఆపై బెయిల్ రాకపోవడం, లోకేష్ సైతం అరెస్టు చేస్తారనే వార్తల నేపథ్యంలో ఆ పార్టీ శ్రేణుల్లో ఒకింత అలజడి నెలకొంది. ఈ క్రమంలో జనసేనాని పొత్తు ప్రకటనతో టిడిపి శ్రేణులకు ఉత్సాహాంతోపాటు ధైర్యాన్నిచ్చిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇదే క్రమంలో గోడమీద పిల్లిలాంటి బిజెపి ఎటులేనాని పొత్తుల సంగతి తమ జాతీయ నేతలు చూసుకుంటారని, పవన్ తమ పొత్తు కొనసాగుతుందని ప్రకటించడం వెనుక మర్మమేమిటా అని అంతా తర్జనభర్జనలు పడుతున్నారు.



పవన్ కల్యాణ్ ప్రకటనతో జిల్లాలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఒకరకమైన జోష్ నెలకొంది. జనసేనకు ఉన్నంతలో బలమైన ఓటుబ్యాంకు ఉన్న జిల్లాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అగ్రస్థానంలో ఉంది. పలు నియోజకవర్గాల్లో కాపు సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉండటం, వారితో ఎక్కువ శాతం జనసేనకు అండగా ఉంటున్న పరిస్థితి స్థానిక సంస్థల ఎన్నికల నుంచి స్పష్టంగా కన్పిస్తోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి, జనసేన పరస్పర అవగాహనతో పోటీకి దిగడం కూడా వైసిపికి గట్టిపోటీనిచ్చినట్లయ్యింది. గత సాధారణ ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేసినప్పటికీ జిల్లాలోని నరసాపురం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు వంటి నియోజకవర్గాల్లో ఆ పార్టీ ప్రభావం చూపించింది. నాటి వామపక్షాల సహకారంతో పలు నియోజకవర్గాల్లో టిడిపిని వెనక్కినెట్టి రెండోస్థానంలో జనసేన నిలిచిన పరిస్థితి ఉంది. నాటి కంటే ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన నిర్మాణం బలపడటంతో క్షేత్రస్థాయిలో సైతం బలం పెరిగినట్లు కన్పిస్తోంది. ఒంటరిగా పోటీచేస్తే గెలవడం కష్టసాధ్యమని, టిడిపితో కలిసి ఎన్నికలకు వెళ్తే వైసిపిని ఓడించొచ్చని జనసేనాని యోచిస్తున్నట్లు కొంతకాలంగా విస్తృత చర్చ సాగుతోంది. వైసిపి ప్రభుత్వ దుందుడుకు వైఖరి, నిర్బంధాల రీత్యా టిడిపి కూడా ఆదేవిధంగా ఆలోచన చేస్తున్న పరిస్థితి ఉంది. జనసేన ప్రస్తుతం ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉంది. బిజెపితో కలిసి జనసేనాని పని చేస్తున్నారు. బిజెపి మాత్రం టిడిపితో పొత్తుకు సంసిద్ధంగా లేనట్లు సంకేతాలిస్తూ వస్తోంది. బిజెపి టిడిపితో పొత్తుకు ఒప్పుకోకపోతే పవన్ టిడిపితో పొత్తు పెట్టుకుంటారా అనే అనుమానాలు ఇరుపార్టీల నేతల్లోనూ నెలకొంది. అయితే గురువారం రాజమండ్రిలో పవన్ చేసిన ప్రకటనతో ఆ అనుమానాలన్నీ పక్కకుపోయాయి. ఇక ఎవరెవరు ఎక్కడ పోటీ చేసే అవకాశం ఉందనే అంశంపై సమాలోచనలు ప్రారంభమయ్యాయి.

సీట్ల పంపకాలపై చర్చలు

టిడిపి, జనసేన పొత్తు ఖాయమని పవన్ ప్రకటించడంతో జిల్లాలో అసెంబ్లీ సీట్ల పంపకాలపై ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాతిపదికన లెక్కిస్తే 14 ఎంఎల్‌ఎ, రెండు ఎంపీ స్థానాలున్నాయి. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, ఏలూరు మొత్తం ఐదు స్థానాలను జనసేన కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా ఉంగుటూరు స్థానానికి సంబంధించి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ఈయన గత కొంతకాలంగా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసిన పరిస్థితి ఉంది. ఈ నియోజకవర్గంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో టిడిపి ఉంగుటూరు స్థానాన్ని జనసేనకు కేటాయిస్తుందా అనే అనుమానాలున్నాయి. ఏలూరులో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మాజీ ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి సోదరుడు చంటి వ్యవహరిస్తున్నారు. జనసేన నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన రెడ్డి అప్పలనాయుడు ఈ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇక్కడ కూడా ఏ పార్టీ బరిలోకి దిగుతుందనేది సందిగ్ధత నెలకొంది. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం సీట్ల విషయంలో పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని లెక్కలు వేస్తున్నారు. సీట్ల పంపకాలకు వచ్చేసరికి జిల్లాలో పొత్తు ఏ విధంగా ఉంటుందో వేచిచూడాలి.

కైకలూరు దీక్షలో మాట్లాడుతున్న మాగంటి బాబు

కొనసాగిన టిడిపి నేతల నిరసనలు

ప్రజాశక్తి - విలేకరులు

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐదు రోజులుగా చేపడుతున్న నిరసన కార్యక్రమాలు గురువారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ధర్నాలు చేపట్టారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు అరెస్టు వైసిపి ప్రభుత్వ దుర్మార్గ చర్య అని టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం మూడో రోజు కొనసాగింది. రిలేదీక్షల్లో పాల్గొన్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతూ కృష్ణ మాట్లాడారు. యువతకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చిన చంద్రబాబు కృషిని, ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టుపై రాష్ట్ర ప్రజలందరూ ప్రభుత్వంపై అసహనంతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కవరం మాజీ ఎంపిటిసి ఎ.బజారు, కొండ్రు నాగరాజు, ఎం.ఉదయ్, బేతాళ మురళీకృష్ణ, మన్యం దుర్గారావు, దుద్దే దుర్గారావు, కొత్తూరు బోసు, నెక్కలపొడి శ్రీనివాస్, చిక్కాల పండు, కొండ్రెడ్డి సోమరాజు, సాయల సత్యనారాయణ, తడికమళ్ల గోపాలరావు, పగడం సౌభాగ్యవతి, తూటికుంట రాము, దాసరి శ్యామ్‌చంద్రశేషు, షేక్ ముస్తఫా, కుమార్, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

చాట్రాయి : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చాట్రాయిలోని టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుతో వైసిపి పతనానికి పునాది పడిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, విజయ డైరీ మిల్క్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మండల కార్యదర్శి పలగాని దుర్గారావు, కంచర్ల హనుమంత రావు, రాయవరపు పుల్లారావు, కమ్ముల కొండలరావు, మాజీ సర్పంచులు కోటా జోషి, గార్లపాటి మారేష్, తెలుగు మహిళా నాయకురాలు చంద్రకళ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ఆందోళనకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు కొమ్ము ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి మారేష్, కోటా జోషి, గద్దల నాగేశ్వరరావు, జయరాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ముసునూరు : ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన వ్యక్తిని జైల్లో పెట్టి, 20 సంవత్సరాలు వెనక్కినెట్టిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటం ఆంధ్ర రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యమని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ముసునూరు గ్రామంలోని మండపం సెంటర్ వద్ద రెండో రోజు రిలే నిరహారదీక్షలో ముద్దరబోయిన, అట్లూరి రవీంద్ర, గద్దే రఘుబాబు, కొల్లి గంగారామ్, మేదరమెట్ల సురేంద్ర, లక్కపాం కాంతారావు, గద్దల మోహనరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, రావర్ల ప్రతాప్, రావర్ల బాలకృష్ణ, గూడపాటి అజయ్, కందుల పిచ్చియ్య, సత్యనారాయణ, శేషగిరిరావు పాల్గొన్నారు.

కైకలూరు : చంద్రబాబు విడుదలయ్యే వరకూ దీక్షలు కొనసాగుతాయని మాజీమంత్రి మాగంటి బాబు స్పష్టం చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ కైకలూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలో మాగంటి బాబు పాల్గొన్నారు. ఈ దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. మాజీ ఎంఎల్‌సి కమ్మిలి విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ్‌రాజు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మీ, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు చలసాని జగన్మోహన్‌రావు, టిడిపి జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, టిడిపి బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ చక్రవర్తి పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సంఘీభావం తెలిపారు. ఈ దీక్షలో టిడిపి వడ్డీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ భలే ఏసురాజు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని సురేష్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చాబత్తిన విజయ్, నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ముదినేపల్లిలో టిడిపి నేతల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. టిడిపి కార్యాలయం వద్ద కొడాలి వినోద్ ఆధ్వర్యంలో 'మేము సైతం' అంటూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు ఈ దీక్షలో దావు నాగరాజు, ఈడే సుధాకర్, బి.రవి, పి.సురేష్, వంశీధర్, పి.విశ్వేశ్వరరావు, వి.నరసింహారావు, కె.సుబ్బారావు, బి.రవికుమార్, అయ్యప్ప పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ మండలంలోని మూలలంక పంచాయతీ పరిధిలో చినపుట్లపూడి ప్రాథమిక పాఠశాల భవనం శ్లాబు పెచ్చులూడి నీరు కారుతుందని, దీంతో పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. పడమటిపాలెం బ్యాంకు కాలనీలో డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షం వస్తే ముంపు భయం వెంటాడుతోందన్నారు. దీనికితోడు బాలుర వసతి గృహంలోని మురుగు నీరు కలిసి దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడ సుమారు 50 కుటుంబాల వారు తరచూ రోగాల పాలవుతున్నారన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఎంపిడిఒ కార్యాలయ అధికారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు జక్కుల మహేష్, పి.సత్యన్నారాయణ, పి.రాజేష్, బి.రఘు, పి.గోపి, చింతా నాగరాజు, సిహెచ్.సత్తిరాజు, ఎన్.సీతారామయ్య, ఎన్.బండిరాజు, అశోక్, సాయి, లక్ష్మణ, భోగేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

ఎంహెచ్‌ఒ మాలతిపై చర్యలు కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న ట్రాక్టర్ క్లీనర్‌పై దురుసుగా వ్యవహరించిన ఎంహెచ్‌ఒపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆ వర్కర్‌కు న్యాయంచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ గతనెల 15, 16, 17 తేదీల్లో సెలవు కోసం ట్రాక్టర్ క్లీనరు కెలోమీ సంబంధిత ఎఇతో, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో సిఎల్ లెటర్‌పై సంతకాలు పెట్టించి ఆగస్టు 14న ఎంహెచ్‌ఒ సంతకం కోసం వెళితే సెలవు మంజూరు చేయకుండా సిఎల్ లెటర్‌ను ముఖంమీద కొట్టి పంపించేసి, ఆ మూడు రోజులు ఆమెకు ఆబ్సెంట్ వేసి జీతం రాకుండా చేశారని ఆరోపించారు. ఎంహెచ్‌ఒ మాలతిపై చర్య తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేసి 18 రోజులు కావస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకొకపోవడంతో గురువారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టమని వారు తెలిపారు. ఎంహెచ్‌ఒపై చర్య తీసుకుని కెలోమీ పెట్టుకున్న సిఎల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ రాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, యూనియన్ నాయకులు పివి.రమణ, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు కృషి : నాని

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రచార బ్రోచర్ విడుదల

ఏలూరు టౌన్:ప్రజారోగ్య పరిరక్షణ కోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని పేర్కొన్నారు. పౌరుల ఆరోగ్య సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం దిశగా కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో ఈనెల 15 నుంచి చేపట్టనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రచార బ్రోచర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తిస్తారని, అనంతరం పలు ప్రాంతాల్లో నిర్వహించే ప్రత్యేక మెడికల్ క్యాంపులలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలను నిర్వహించి, ఔషధాలను అందజేస్తారని తెలిపారు. ప్రతి మెడికల్ క్యాంపులోనూ నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉండి అత్యుత్తమ వైద్యం అందిస్తారని తెలిపారు. ఐదు దశల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, దీర్ఘకాలిక వ్యాధులకు సైతం పరీక్షలు చేసి చికిత్స అంది స్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మెడికల్ కళాశాల ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న సిఎం జగన్ - ఇప్పటి వరకూ 120 సీట్లు భర్తీ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'ప్రభుత్వ వైద్య కళాశాల' ఏర్పాటు కల సాకారమైంది. సిఎం జగన్ విజయనగరం నుండి ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాలను వర్చువల్ విధానంలో ఈనెల 15వ తేదీన ప్రారంభించనున్నారు. 2021 మే నెలలో సిఎం ఈ వైద్య కళాశాలకు శంఖుస్థాపన చేశారు. త్వరితగతిన వైద్య కళాశాల నిర్మాణం పూర్తి కావడం విశేషం. ఈ విద్యా సంవత్సరం నుండే తొలి బ్యాచ్ విద్యార్థులకు బోధన ప్రారంభించారు. ఈ కళాశాల నిర్మాణానికి ఆళ్ల నాని ఎంతో కృషి చేశారు. నిర్మాణ పనులు అతి తక్కువ వ్యవధిలో శరవేగంగా అత్యంత నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ఆవరణలో వైద్య కళాశాలకు సంబందించిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసుకోగా, ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో బోధనాసుపత్రి, హాస్టల్ సౌకర్యాలు కల్పించారు. రాష్ట్రంలో పలు మెడికల్ కళాశాలల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 150 ఎంబిబిఎస్ సీట్లతో 2023-24 విద్యా సంవత్సరం నుండి వైద్య తరగతులు ప్రారంభించేందుకు ఎన్ఎంసి అనుమతిచ్చింది. దీంతో ఈ ఏడాది ఏలూరు వైద్య కళాశాలలో 150 మంది మెడికోలు తమ విద్యను ప్రారంభించడానికి అవకాశం కలిగింది. ఇప్పటికే 120 సీట్లు భర్తీ అయ్యాయి. సాధారణంగా వైద్య కళాశాలలు వైద్యంలో డిగ్రీ కోర్సును, మాస్టర్స్ కోర్సును, పిహెచ్‌డి సదుపాయాన్ని అందజేస్తాయి. ఇంతే కాకుండా వైద్యవిద్యకు అనుబంధంగా

ఇదే మెడికల్ కళాశాల

నర్సింగ్, ఫిజియోథెరపీ, లేబొరేటరీ టెక్నాలజీ వంటి కోర్సులను కూడా బోధిస్తాయి. వైద్య కళాశాలలకు అనుబంధంగా హాస్పిటల్ ద్వారా వైద్య సదుపాయం కూడా ఉంటుంది. వైద్యవిద్యలో బోధించే కొన్ని విద్యావిభాగాలు హ్యూమన్ అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ఇమ్యునాలజీ, ప్రసూతి వైద్యం, ఎనస్థీషియాలజీ, అంతర్గత వైద్యం, కుటుంబ వైద్యం, శస్త్రచికిత్స (సర్జరీ), జెనిటిక్స్, పాథాలజీ (రోగ నిర్ధారక శాస్త్రం), ఇవే కాకుండా గుండె, కన్ను, ముక్కు, చెవి, చర్మం, మెదడు, మానసిక ప్రవృత్తి వంటి విషయాలకు సంబంధించిన విద్యాబోధనలకు ప్రత్యేక విభాగాలుంటాయి. వైద్య కళాశాలలున్న ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందడం గమనించొచ్చు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో డిపార్ట్‌మెంటల్ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, లెక్చరర్ గ్యాలరీ, ప్రత్యేక లైబ్రరీ బ్లాక్ కూడా నిర్మాణంలో ఒక భాగంగా ఉన్నాయి.

కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

16న రాజమండ్రిలో నిర్వహణ

ప్రజాశక్తి - పెదవేగి

కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16న రాజమండ్రిలో జరిగే కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం పెదవేగి మండలంలోని విజయరాయి, రాయన్నపాలెం, కొండలరావుపాలెం, బాపిరాజుగూడెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్యటించి కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాజమండ్రిలోని గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ భవనంలో ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి కొబ్బరి రైతులు ఈ సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎకరా కొబ్బరితోటకు రూ.60 వేలకుపైగా పెట్టుబడి అవుతోందని, చెట్టు నుండి కొబ్బరికాయ కోసి గుట్టగా పోయడానికి కాయకు రూ.మూడు ఖర్చవుతుందన్నారు. అయితే వ్యాపారులు ఎండు కొబ్బరికి కాయకు ఏడు రూపాయలకు మించి ధర ఇవ్వడం లేదన్నారు. రైతు చేతికి రూ.మూడు వస్తోందని, కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం విదేశాల నుండి కొబ్బరి ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం వల్లనే కొబ్బరి రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు ఆపాలని కోరారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఆయిల్ ఫెడ్ కమిషనర్ ప్రకటించడం హర్షణీయమన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మిల్లింగ్ కొబ్బరి క్వింటాల్‌కు రూ.10,860, బంతి కొబ్బరి క్వింటాల్‌కు రూ.11,750 ధర రైతుకు గిట్టుబాటు కాదన్నారు. ఈ కేంద్రాలు వ్యాపారులకు ఉపయోగం తప్ప రైతుకు ఏ మాత్రమూ ప్రయోజనకరం కాదన్నారు. ఒక్కో కొబ్బరికాయకు రూ.15 ధర ఇచ్చి రైతుల నుండి కొబ్బరికాయల సేకరణ చేసే విధంగా కొనుగోలు నిబంధనలు మార్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేసి కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులు సంఘటితంగా సమస్యలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.రమేష్‌రెడ్డి, జి.వీరారెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టులో రాజకీయ దురుద్దేశం లేదు : బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సాక్ష్యాధారాలతో అడ్డంగా దొరికిపోయి అరెస్టు అయిన టిడిపి అధినేత చంద్రబాబు శిక్ష నుండి తప్పించుకోలేరని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని తెడ్లం గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు ప్రజల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిటిసి బండి సుబ్బారావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అవినీతి చక్రవర్తి అని విమర్శించారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో అనేక కుంభకోణాలు చేసి తనపలుకుబడి, వ్యవస్థలను మేనేజ్ చేసుకుని, కోర్టుస్టేలతో బతికిపోయారన్నారు. అయితే ఎప్పుడూ ఒకేలా ఉండదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు 2018లోనే సిఐడి అధికారులు దర్యాప్తు చేపట్టారన్నారు. అధికారంలో ఉన్న చంద్రబాబు కేసు ముందుకు సాగనివ్వలేదన్నారు. సిఐడి అధికారులు రెండేళ్లపాటు సమగ్ర విచారణ చేపట్టి, సాక్ష్యాధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. చంద్రబాబు అరెస్టులో రాజకీయ కోణం కానీ, వేరే దురుద్దేశంగానీ లేదన్నారు. అరెస్టయిన తర్వాత సానుభూతి కోసం చంద్రబాబు నాటకాలు మొదలుపెట్టారని విమర్శించారు. రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని కానీ ప్రజల్లో అలాంటి సానుభూతి లేదన్నారు. దానికి ఉదాహరణగా టిడిపి బందు పిలుపుతో ప్రజలు లేకపోవడంతో తేలిపోయిందని తెలిపారు. టిడిపి, జనసేన ఎవరు ఎవరితో కలిసి వచ్చిన జగన్ విజయాన్ని ఆపలేరన్నారు. నవరత్నాలు వైసిపికి శ్రీరామరక్ష అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 కి 175 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు, ఎంపిపి డి.లక్ష్మి, ఎస్‌విపికె హెచ్‌శ్రీనురాజు, సొసైటీ చైర్‌పర్సన్‌లు దేవరపల్లి ముత్తయ్య, పిన్నమనేని చక్రవర్తి, తుమ్మూరి శ్రీనివాస్‌రెడ్డి, కన్నం సర్వేశ్వరరావు, వంటిపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

రెండో పిహెచ్‌సి ఏర్పాటుకు స్థలం మ్యాపును పరిశీలిస్తున్న జెసి

రోగులకు ఇబ్బంది లేకుండా చర్యలు : జెసి

తక్కెళ్లపాడులో రెండో పిహెచ్‌సి ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - మండవల్లి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన అన్నిసేవలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి స్పష్టం చేశారు. మండలంలోని తక్కెళ్లపాడులో రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే రోగులు ఆసుపత్రికి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడం, ఆసుపత్రి ముందు పంట కాలువ ఉండటంపై ఆ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ఆమె నిరాకరించారు. ఆరోగ్య కేంద్రం వెనుకే కొల్లేరు ఉండటంతో ఎగువ ప్రాంతాల నుండి వరద వస్తే ఆసుపత్రి మునిగిపోయే ప్రమాదం ఉందని ఇక్కడ ఎలా నిర్మిస్తారని ఆమె ప్రశ్నించారు. గ్రామంలో ఇంకా ఎక్కడైనా ఖాళీ ప్రాంతం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. దీంతో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ జెసితో మాట్లాడారు. జగనన్న కాలనీని నిర్మించే విధంగా స్థానిక శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు చొరవతో స్థలాన్ని ఎంపిక చేసి పూర్తిస్థాయిలో మేరక చేయించామని, అంతేకాకుండా పిహెచ్‌సికి వెళ్లేందుకు కాలువపై వంతెన నిర్మాణానికి మండల పరిషత్ నుండి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఆమె దృష్టికి తీసుకు వచ్చారు. తక్కెళ్లపాడులో ఆస్పత్రి నిర్మిస్తే సుమారు పది గ్రామాలకు చెందిన రోగులు వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుందని ఆయన జెసికి వివరించారు. స్థలానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నివేదిక తయారుచేసి పంపించాలని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చేబ్రోలు సుధారాణి, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు బేతపూడి ఏసేబురాజు, సర్వేయర్ బసవరాజు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సృజనాత్మకత, ఆధునిక సాంకేతికత మా ప్రత్యేకత

శ్రీసోమా కన్‌స్ట్రక్షన్స్ అధినేత సూరత్‌తేజ

ప్రజాశక్తి - ఏలూరు



ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకుని సరికొత్త పద్ధతుల్లో నిర్మాణాలు చేపట్టడం తమ ప్రత్యేకత అని శ్రీసోమా కన్‌స్ట్రక్షన్స్ అధినేత సూరత్‌తేజ అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. తమ సంస్థను 2014 నవంబర్ 22న ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి ప్రజల ఆదరాభిమానాలతో విజయపథంలో ముందుకు సాగుతున్నామన్నారు. ఏలూరులో మెయిన్‌బ్రాంచితో పాటు విజయవాడ, జంగారెడ్డిగూడెంలో బ్రాంచీలు ప్రారంభించామని చెప్పారు. తమ సంస్థకు సంబంధించి ఫ్యూచర్‌లైన్ ఆర్గనైజేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు అందజేత, పేదలకు దుస్తుల పంపిణీ, పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతున్నామన్నారు. కళాశాల విద్యార్థులకు సంబంధించి వారి భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి కొన్ని ట్రస్టుల ద్వారా తమ సంస్థ బహుమతులను అందిస్తుందన్నారు. నిర్మాణ రంగంలో సృజనాత్మకత, ఆధునిక సాంకేతికత మేళవింపు తమ విజయానికి పునాది అని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో నిర్మాణ రంగంలో తమదైన ప్రత్యేకత చాటుకుంటున్నట్లు తెలిపారు. నమ్మకానికి, నాణ్యతకు మారుపేరుగా తమ సంస్థ నిలబడటం ఎంతోసంతోషంగా ఉందన్నారు. తోటి ఇంజినీర్లకు ఆయన ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

'లిటిల్ ఫ్లవర్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముదినేపల్లి

యువజన వారోత్సవాల సందర్భంగా గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో తమ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించినట్లు లిటిల్ ఫ్లవర్స్ స్కూల్ ప్రిన్సిపల్ బి.రఘురామయ్య గురువారం తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వీరమల్లు పావని, రొంపిచర్ల నిత్యశ్రీ, రాయగిరి కనకమణి కార్తికేయ, ఇనుపకుత్తిక రాజేశ్వరరాజులను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు.

టి.నరసాపురం : మాట్లాడుతున్న హెచ్‌ఎం బిఎల్.స్వామి

ఘనంగా హిందీ దినోత్సవం

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు బాల్యం నుంచే హిందీ భాష పట్ల ఆసక్తి పెంచుకోవాలని టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎల్.స్వామి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బండివారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీ భాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14న భారత ప్రభుత్వం హిందీని జాతీయ భాషగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు హిందీ భాష ప్రాముఖ్యతను గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విజి .కృష్ణారావు, కె.కుటుంబరావు, ఎం.నాగేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారం హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌టిఎం మేళా నిర్వహించారు. ఈ మేళాలో హిందీ ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో హేమ రేవంత్, కీర్తి, దివ్య, షేక్ కరీమున్నీసా ఇతర విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వై.విజయ్‌కుమార్, సూర్యనారాయణరాజు, చంద్రిక పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - మండవల్లి

అంగన్‌వాడీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాడు సర్పంచి బేతపూడి ఏసేబురాజు తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసేబురాజు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో సంభవించే పోషకాహార లోపంతో కలిగే రక్తహీనత, ఎదుగుదల లోపం, మాతా శిశు మరణాలు వంటి అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బాలింతలకు, గర్భిణులకు అవసరమైన పది రకాలైన వస్తువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. వీటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఆయన కోరారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న బొండాడ వెంకన్నబాబు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని తిరుమలంపాలెంలో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ వ్యవస్థను ఎంపిపి మోహిని భర్త, వైసిపి నేత బొండాత వెంకన్నబాబు గ్రామ సర్పంచి నిర్మలప్రసాద్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. తిరుమలంపాలెం సచివాలయానికి వచ్చిన ప్రజలతో ఆయన నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఆకుర్తి సత్యనారాయణ, చందు, లక్ష్మణ్‌రావు, సుబ్బారావు పాల్గొన్నారు

'అగ్రిగోల్డ్ ఉద్యమంపై అణచివేత ధోరణి తగదు'

ప్రజాశక్తి - కలిదిండి

విజయవాడలో జరగనున్న అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ ర్యాలీపై ప్రభుత్వం అణచివేత ధోరణి ప్రదర్శిస్తుందని అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు చక్కా జగన్మోహనరావు అన్నారు. కలిదిండిలో ఆయనకు నోటీస్ అందించి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులకు సొమ్ము చెల్లించకపోవడం బాధాకరమన్నారు. బాధితులకు సిఎం జగన్ ఇచ్చిన మాట తప్పి, మడం తిప్పారని విమర్శించారు. నాయకులకు నోటీసులు ఇచ్చి హౌస్ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు చివరి రూపాయి అందేవరకు పోరాడతామన్నారు.

ఘనంగా జాన్‌పేట యూత్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కైకలూరు

జాన్ పేట యూత్ అసోసియేషన్ స్థాపించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు గురువారం స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆసుపత్రిలో వంద మంది రోగులకు పండ్లు, బ్రెడ్ పాకెట్లను పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు సుధీర్, వ్యవస్థాపక కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా దళిత బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నాలెడ్జి సెంటర్ నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యనిర్వాహక సభ్యులు శామ్యూల్, రాజశేఖర్, అసోసియేషన్ సభ్యులు సురేష్, రాము, కిరణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గ్రావెల్, కంకర అక్రమ నిల్వలు

పోలవరం కాలువ గట్టును తవ్వేస్తున్న మట్టిమాఫియా

పట్టించుకోని అధికారులు, ప్రజల నుంచి విమర్శలు

కైకరంలో గ్రావెల్ గుట్ట

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరం, చేబ్రోలు గ్రామాల్లో గ్రావెల్, కంకర గుట్టలను అక్రమంగా నిల్వ చేస్తున్నారు. గ్రావెల్ అవసరమైనవారు అనుమతులున్న క్వారీల ద్వారా కొనుక్కోవాల్సి ఉంది. అయితే ఇప్పుడు మట్టి మాఫియా రూటు మార్చింది. శని, ఆదివారాల్లో రాత్రిళ్లు పోలవరం కాలువ గట్టు నేలను, కంకర గుట్టలను తవ్వేసి భారీ వాహనాలతో ఖాళీ ప్రాంతాల్లో నిల్వ చేసి అమ్ముకుంటున్నారు. ఎలాంటి మైనింగ్, చెస్‌లు లేకుండా కంకర నిల్వలు, అమ్మకాలు సాగిస్తున్నారు. నిబంధలనకు విరుద్ధమైనా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలవరం కాలువ గట్టు నేలలో నాణ్యమైన కంకర లభ్యమౌతుంది. దీనికి మంచి గిరాకీ, ధర ఉంటుంది. ఈ క్రమంలో రాత్రిళ్లు కాలువ గట్టు నేలను తవ్వేసి కంకరను తరలించి భారీ ఎత్తున కొండల్లా నిల్వలు ఉంచి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధలనుకు విరుద్ధంగా తవ్వేసిన కంకరను కైకరంలో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న రోడ్లకు సైతం వినియోగించడం గమనార్హం. కైకరంలో అక్రమంగా నిల్వ ఉంచిన కంకరపై కథనాలు ప్రచురించవద్దని కొందరు ప్రజాశక్తిపై ఒత్తిడి తెస్తున్నారు.

'ఉపాధ్యాయులకు ఐఆర్ ఇవ్వాలి'

ప్రజాశక్తి - ఉంగుటూరు

గత పిఆర్‌సిలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున నష్టపోయారని, ఎన్నికలకు ముందే ఐఆర్ ఇవ్వాలని స్టేట్ టీచర్స్ యూనియర్ (ఎస్‌టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పిఎస్.ప్రకాష్ డిమాండ్ చేశారు. ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు మండల శాఖ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎస్.ప్రకాష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని, పిఎఫ్ రుణాలు, ఎపిజిఎల్‌ఐ రుణాలు చెల్లించాలని కోరారు. అనంతరం మండల కమిటీ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యర్రా నరసింహరావు, ప్రధాన కార్యదర్శిగా బి.నాగరాజు, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కెవిఎన్.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

దెందులూరు గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం

డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్ విచారణలో తేలిన నిజాలు

సర్పంచి, పంచాయతీ మాజీ కార్యదర్శికి తాఖీదులు

ప్రజాశక్తి - ఏలూరు

దెందులూరు గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్ విచారణలో తేలింది. స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్‌ను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసవిశ్వనాథ్ ఆదేశించారు. ఈ విచారణలో సుమారు రూ.1.9 కోట్లు దుర్వినియోగం అయ్యాయని తేలింది. ప్రజల నుంచి వసూలు చేసిన ఇంటి పన్ను నగదును ప్రభుత్వ ఖజానాకు కట్టకుండా స్వంతానికి వాడుకున్నట్లు, గ్రామ పంచాయతీ సాధారణ నిధులను సర్పంచి టి.యేసమ్మ, దెందులూరు పంచాయతీ మాజీ కార్యదర్శి యెహెూసువా సొంత బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసినట్లు విచారణలో గుర్తించినట్లు తెలిసింది. దెందులూరు గ్రామ పంచాయతీలో రూ.1,09,36,044 నిధులు దుర్వినియోగం అయ్యాయని నివేదికను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దృష్టికి జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసవిశ్వనాథ్ తీసుకెళ్లగా సర్పంచి టి.యేసమ్మకు, పంచాయతీ మాజీ కార్యదర్శి జి.యెహెూషువాకు వివరణ కోరుతూ తాఖీదులు జరి చేశారు. విచారణలో సర్పంచి రూ.50,02,054, కార్యదర్శి రూ.59,33,990 నిధులు దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. సర్పంచి యేసమ్మ, కార్యదర్శి యెహెూసువా నుంచి వివరణ తీసుకొని అనంతరం శాఖపరంగా తుది చర్య చేపట్టనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసవిశ్వనాథ్ తెలిపారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి, అవినీతికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు.

పోస్టుమెన్‌గా వీరనాగేశ్వరరావు సేవలు అభినందనీయం

ఉద్యోగ విరమణ కార్యక్రమంలో వక్తలు

వీరనాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - మండవల్లి

ఉత్తరాలు అందించే పోస్ట్‌మెన్‌గా పోతర్లంక వీరనాగేశ్వరరావు విశిష్ట సేవలందించారని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రొఫెసర్ విజయకుమార్ తెలిపారు. స్థానిక పోస్టాఫీస్‌లో గురువారం నిర్వహించిన వీర నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వీరనాగేశ్వరరావు 44 ఏళ్ల పాటు పోస్ట్‌మెన్‌గా పని చేశారన్నారు. ఇంటింటికి తిరిగి ఉత్తరాలను అందించారన్నారు. ఉత్తరాలు అందించే క్రమంలో ఆయన ఎంతో మర్యాదగా నడుచుకుంటూ చిరునవ్వుతో అందరిని అప్యాయంగా పలకరించేవారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం గల మనిషి నాగేశ్వరరావు అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆనందంగా గడుపుతూ కొంత సమయం పర్యావరణ పరిరక్షణలో, ప్రజాసేవలో కొనసాగాలని ఆయన కోరారు. చిరకాలం గుర్తుండిపోయేలా రాజ్యాంగంతో పాటు మంచి మంచి పుస్తకాలు, పచ్చటి మొక్కను అందించి మొక్కను నాటి సంరక్షించాలని ఆయన తెలిపారు. అనంతరం నాగేశ్వరరావు దంపతులను దుశ్శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల అధ్యక్షులు అప్పారావు, పిఎసిఎస్ అధ్యక్షుడు గోకర్ణ యాదవ్, రిటైర్డ్ టీచర్ బి.కొండయ్య, రామ్‌మోహన్, మెండ సురేష్, మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి సబ్ పోస్ట్‌మాస్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబర్చాలని నూజివీడు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షులు బి.సుకుమార్ అన్నారు. ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్ చేతులమీదుగా బాలుర ఆటల పోటీలను గురువారం ప్రారంభించారు. అండర్-14లో ఖోఖో బాలుర జట్టుకు 14 మంది, అండర్-17 ఖోఖో బాలుర జట్టుకు 16 మంది, అండర్-17 బాల్‌బ్యాడ్మింటన్ బాలుర జట్టుకు 21 మంది, అండర్-14 బాల్ బ్యాడ్మింటన్ బాలుర జట్టుకు 16 మంది, అండర్-14 షెటిల్ బాలుర జట్టుకు ఐదుగురు, అండర్-17 షెటిల్ బాలుర జట్టుకు ఐదుగురు, అండర్-17 టెన్నికాయిట్ బాలుర జట్టుకు ఐదుగురు, అండర్-14 టెన్నికాయిట్ జట్టుకు ఐదుగురు, అండర్-14 వాలీబాల్ జట్టుకు17 మంది, అండర్-17 వాలీబాల్ జట్టుకు 17 మంది ఎంపికై జిల్లాస్థాయి ఆటల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు పి.రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వాకా నాగరాజు, ఆలీఖాన్, హేమ, సుగణరావు, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వాణి, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియోజకవర్గ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

త్వరలో బురుగుగూడెం-చిత్తపూరు రోడ్డుకు మరమ్మతులు

నూజివీడు సబ్ డివిజన్ ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ బాబూరావు



రోడ్డును పరిశీలిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చాట్రాయి, చిత్తపూరు మధ్య గొల్లగూడెం వద్ద రోడ్డుకు త్వరలోనే మరమ్మతులు చేస్తామని నూజివీడు సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సిహెచ్.బాబూరావు తెలిపారు. ఆ ప్రాంతాన్ని ఆయన గురువారం పరిశీలించారు. గొల్లగూడెం వద్ద రోడ్డుపై గుంతలు పడి అధ్వానంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆరుగొలనుపేట గ్రామానికి చెందిన పుచ్చకాయల శేఖర్‌రెడ్డి ఈ నెల 11వ తేదీన సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. స్పందన అర్జీపై నూజివీడు సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సిహెచ్.బాబూరావు స్పందించి గొల్లగూడెం రోడ్డు ప్రదేశాన్ని పరిశీలించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. బురుగుగూడెం నుంచి చిత్తపూరు వరకు వార్షిక మరమ్మతుల కింద నిధులు మంజూరయ్యాయని, టెండర్లు కూడా పిలిచామని, కాంట్రాక్టర్ అగ్రిమెంట్ అయిన వెంటనే మరమ్మతులు ప్రారంభిస్తామని ఎండార్స్‌మెంట్ ద్వారా తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు : మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

అర్హులైన పేదలందరికీ పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో ఆనందాన్ని చూడడమే సిఎం జగన్ లక్ష్యమని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. స్థానిక 50వ డివిజన్‌లో పింఛన్లు మంజూరైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు గురువారం ఎస్ఎంఆర్ నగర్‌లో మేయర్ నూర్జహాన్ పెదబాబు చేతులమీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ సిఎం జగన్ అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లను మంజూరు చేసి ఎందరో జీవితాల్లో సంతోషాన్ని నింపారన్నారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్, ఏలూరు నియోజకవర్గ 50 డివిజన్ల పరిధిలో ఎంఎల్‌ఎ ఆళ్ల నాని చొరవతో ఈ నెలలో రెండు విడతలుగా మొత్తంగా 1658 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ప్రతినెలా 29,500 మందికి సుమారు రూ.8 కోట్లు పింఛన్ల రూపంలో అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గవరపేట నాయుడు, మానుకొండ శ్రీను, మణిపూరి కుమారి, పిల్లా శివ, నక్క కృష్ణ, రామకృష్ణ, శ్రీను, మల్లేశ్వరరావు, సచివాలయ అడ్మిన్ ప్రదీప్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని కేతవరం పంచాయతీలో కొత్తగా మంజూరైన వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు 18 మందికి వైసిపి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి మధుతో కలిసి కేతవరం సర్పంచి తడికలపూడి శివమాధవి కిషోర్ గురువారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పెన్షన్లు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. అర్హులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బొడ్డపాటి రాంబాబు, వైసిపి నాయకులు వంటిపల్లి వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఆచంట కుటుంబరావు, కిషోర్, బాలిన రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గూటాల పంచాయతీలో నూతనంగా పెన్షన్ వచ్చిన లబ్ధిదారులకు జిల్లా ఎంపిపి సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెన్షన్ తీసుకోవాలంటే జన్మభూమి కమిటీ వారితో వారికి నచ్చిన వారికే పెన్షన్ కేటాయించేవారని, వైసిపి హయాంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పెన్షన్ వస్తుందని చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి వాలంటీర్లు పెన్షన్ అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు హరిరామకృష్ణ, సర్పంచి సిరిపూరపు ప్రసాద్, గూటాల సొసైటీ ప్రెసిడెంట్ సుంకర అంజిబాబు, వైసిపి నాయకులు శ్రీరామకృష్ణ, డాక్టర్ శ్రీను, మహంతి అబ్బులు, కరిబండి రాంబాబు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండలంలోని కామయ్యపాలెం పంచాయతీలో నూతనంగా మంజూరైన పెన్షన్లను గురువారం పంపిణీ చేసినట్లు వైస్ ఎంపిపి-2 ఉప్పల లలితకుమారి తెలిపారు. మండలవ్యాప్తంగా 335 పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. వాటిలో కామయ్యపాలెం పంచాయతీలో 20 పెన్షన్లు మంజూరవ్వగా లబ్ధిదారులకు అందించినట్లు ఆమె తెలిపారు. పార్టీలకతీతంగ అర్హులైన వారందరికీ పెన్షన్ మంజూరు చేసిన ఘనత వైసిపికే చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బొడిక భోగేశ్వరావు, సీనియర్ నాయకులు ప్రసాద్, ఉప్పల రాంపండు, దొడ్డకుల సత్యనారయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న మేయర్

జంగారెడ్డిగూడెం : పట్టణంలో 226 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేయడం హర్షణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. పట్టణంలో నూతనంగా మంజూరైన పింఛన్లను స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నాగలక్ష్మి చేతులమీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన చేస్తున్నారన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు మాట్లాడుతూ సిఎం జగన్ ఆరు నెలలకోసారి కొత్తగా పింఛన్లు మంజూరు చేస్తూ ఎంతోమందికి సాయపడుతున్నారన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులందరికీ పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన

ప్రజాశక్తి - పోలవరం

ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు, ఎఎన్ఎంలకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు.

నేడు ఏలూరులో..

ఏలూరు టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ముందస్తు అవగాహన సమావేశం ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిపి పెన్మత్స శ్రీనివాసరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిటిసి సభ్యులు, జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, మెడికల్ స్టాఫ్, ఐసిడిఎస్, పంచాయతీ కార్యదర్శులు ముందస్తు అవగాహన సమావేశానికి హాజరు కావాలని కోరారు.



వినతిపత్రం అందిస్తున్న మధుమోహన్

అర్హులకు పంట రుణాలు అందించాలి

ప్రజాశక్తి - ముసునూరు

అర్హత కలిగిన ప్రతి వ్యవసాయ రైతుకు పంట రుణాలు అందించాలని ముసునూరు మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు ఆయన గురువారం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధుమోహన్ మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతుకు భూమిని బట్టి పంట రుణాలు ఇవ్వాలని, కౌలు రైతులకు పండించిన పంటను బట్టి కౌలు రైతు రుణాలు అందించాలని, మండలంలోని 16 గ్రామాల్లోని 950 మందికి కౌలు కార్డులు అందించామని తెలిపారు.

టిడిపి, జనసేన శ్రేణుల హర్షం

ప్రజాశక్తి - కలిదిండి

ప్రతి పక్షమైన టిడిపితో కలిసి వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో జనసేన, టిడిపి శ్రేణులు టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్, రంగా, యలవర్తి కృష్ణమూర్తి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లంకా రత్నారావు, మేకా భోగేశ్వరరావు, సుంకర శ్రీను, జడ్డు సుబ్రహ్మణ్యం, కంచర్ల సురేష్, కాసా ప్రభాకర్, అబ్దుల్ అస్లాం, సిరిపురపు సాయి, అయూబ్ ఖాన్, క్రాంతి పాల్గొన్నారు.

నోటీసు

ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల నివాసం శ్రీ **కోరుప్రోలు వీరయ్య గారి కుమారుడు, శ్రీ సత్యనారాయణ** సంజాయిషీ మేర జారీ చేసిన ప్రకటన.., ది.03-01-2006వ తేదీన శ్రీ కోరుప్రోలు సత్యనారాయణ గారు శ్రీ సిరిపురపు కందాళ వెంకట బలరామాచార్యులు మరియు వారి కుటుంబ సభ్యుల నుండి ఆర్.ఎస్.నెం. 108/3, డో.నెం. 7-106 నందు గల భవనము కొనగోలు చేసినారు. దీని డాక్యుమెంటు నెం. 66/2006. ఈ ఆస్తి తాలూకా లింకు డాక్యుమెంటు నెం. 3921/2002, ది.16-09-2002 నందు శ్రీ సిరిపురపు కందాళ బలరామాచార్యులు గారు వారి భార్య అయిన శ్రీమతి వాణికి దాఖలు చేసియున్నారు. ఈ డాక్యుమెంటు ది.03-01-2006 కొనుగోలు సమయమునందు శ్రీ సత్యనారాయణ గార్కి ఇచ్చియున్నారు. వీరు ఏలూరు వచ్చు ప్రయాణములో పోగొట్టుకొనియున్నారు. ఎన్ని ప్రయత్నములు చేసిననూ డాక్యుమెంటు నెం. 3921/2002 దొరికియుండలేదు. ప్రస్తుతం ఈ ఆస్తి పై శ్రీ సత్యనారాయణ గారు అప్పుకొరకు M/s. Piramil Capital And Housing Finance Ltd., వారిని సంప్రదించినారు. ఇందుమూలముగా ఎవ్వరికీ ఏవిధమయిన అభ్యంతరములు ఉన్ననూ వారం రోజులు లోగా తెలియపరచవలెను.

<u>షెడ్యూలు:</u> ఏలూరు జిల్లా, ద్వారకా తిరుమల (మం), కొమ్ముగూడెం గ్రామం, ఆర్.ఎస్.నెం. 108/3, డో.నెం. 7-106, భవనమునకు హద్దులు: **<u>తూర్పు:</u>** ఆర్ అండ్ బి రోడ్డు. **<u>దక్షిణం:</u>** సాతులూరి శేషమ్మ గారి స్థలం. **<u>పడమర:</u>** రహదారి. **<u>ఉత్తరం:</u>** రహదారి.

పి.ఎస్.చంద్
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
13-9-23. సెల్: 94401 11566

<u>ప్రకటన</u>

మహారాజశ్రీ 2వ అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు :: భీమవరం

<u>D.V.C.No. 11/2021</u>

<u>బిట్వీన్:</u>
పోట్రు శాంతి కుమారి ...కంప్లైనెంట్
అండ్
పోట్రు ప్రవీణ్ కుమార్ ...రెస్పాండెంట్

పై నెంబరు D.V.C.లోని, రెస్పాండెంటు అయిన పోట్రు ప్రవీణ్ కుమార్, తండ్రి: పోట్రు కోటేశ్వరరావు, క్రిస్టియన్, వయస్సు 36 సం॥లు, R/o. చెబ్రోలు విలేజ్, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా అను వారికి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినా తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు అనే కారణముగా ఈ కోర్టు వారు ది.04-09-2023 సం॥రం తేదీన ప్రజాశక్తి ఏలూరు ఎడిషన్ పేపరులో పబ్లికేషన్ ద్వారా రెస్పాండెంటుకి D.V.C. నోటీసులు అమలు చేయమని ఆదేశించడము అయినది. కనుక ఈ D.V.C. లో రెస్పాండెంటు అయిన పోట్రు ప్రవీణ్ కుమార్, తండ్రి: పోట్రు కోటేశ్వరరావు **ది.18-10-2023 సం॥రం తేదీన స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టుకు హాజరు అయి సదరు కేసులో ఆక్షేపణలు ఉన్న భీమవరం 2వ అదనపు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకి వచ్చి విన్నవించుకోవాలని ఇందుమూలముగా తెలియజేయటము జరిగింది.**

సి.జ్వాలా శ్రీనివాస్
కంప్లైనెంట్ తరపు న్యాయవాది,
భీమవరం, భీమవరం.
14-9-23. సెల్: 93939 39374